కథ

# గాలి బంధాలు!

శైలకుమార్

దినపత్రిక పక్కన పడేసి స్నానానికి బయలుదేరుతూ ఉండగా "ఆకలేస్తే అన్నం పెడతా... అలిసొస్తే' అంటూ మోగసాగింది సెల్లు.

విసుగ్గా దాన్ని అందుకున్నాడు రామారావు.

"అదేమి రింగ్‌టోనండి. మీకెన్ని సార్లు చెప్పాను మార్చేయమని? ఇది ఇద్దరు అమ్మాయిలుండే ఇల్లు" రామారావుకు టవలందిస్తూ విసుగు, కోపం ధ్వనించే కంఠంతో అంది భార్య మాధవి.

"ఏం చేయమంటావు? ఈ రింగ్‌టోన్ పెట్టింది నేను కాదు, నీ పెద్ద కూతురు సౌమ్య'.

"అవునా!" ఆశ్చర్యంగా అంది మాధవి.

"అవునమ్మా! నేనే. దానివల్ల చాలా ప్రయోజనాలున్నాయి తెలుసా?' కాలేజీకి రెడీ అవుతున్న సౌమ్య హాల్లోకి వస్తూ చెప్పింది.

"ఏమిటే అది?" వ్యంగ్యంగా అడిగింది కూతుర్ని.

"నాన్న పెద్ద జర్నలిస్టు కదా. ఏ మంత్రిగారి ప్రెస్ మీట్‌లోనో ఉన్నప్పుడు ఇది మోగిందనుకో. అందరితోపాటు మంత్రిగారి దృష్టి నాన్న మీద పడుతుంది. అదే ఏ భక్తిగీతమో అయితే ఎవరూ పట్టించుకోరు" నవ్వుతూ చెప్పింది సౌమ్య.

"సరి సరి. సరిపోయారు తండ్రీ కూతుళ్ళు".

"ఆకలేస్తే అన్నం పెడతా... అలిసొస్తే" మళ్ళీ మ్రోగసాగింది సెల్లు.

"ఆ గొడవేదో ముందు చూడండి. వినలేక చస్తున్నాను" చెవులు మూసుకుని వంట గదిలోకి నడుస్తూ అంది మాధవి.

"హల్లో!" పలకరించాడు రామారావు.

"రేయ్ నేను"

"లక్ష్మీ నువ్వా చెప్పు" అన్నాడు కొన్ని క్షణాల తర్వాత గొంతు గుర్తుపట్టి.

"గుర్తు పట్టావా!"

"నీ గొంతు గుర్తుపట్టలేనా? ఏమిటి నెంబరు మార్చావా?"

"అవును. ఆ సెల్ పోయింది".

"అలాగా! అందుకే నీ పేరు డిస్‌ప్లే కాలేదు"

"ఈ నెంబర్ ఫీడ్ చేసుకో"

"ఊఁ ఏమిటి సంగతులు"

"ఓ సహాయం కోరి ఫోన్ చేస్తున్నా" అభ్యర్థనగా అవతల నుంచి.

"చెప్పు"

"నా మిత్రుడు సుందర్ అని కుటుంబంతోసహా శ్రీవారి దర్శనానికి వస్తున్నాడు. ఓ గది, దర్శనం ఏర్పాట్లు చెయ్యాలి".

"కొండమీద బాగా రద్దీగా ఉంది లక్ష్మీ. కష్టమౌతుంది".

"ప్రముఖ జర్నలిస్టువి నువ్వే అలా అంటే ఎలా? నాకు బాగా కావల్సినవాళ్లు. అంచేత నిన్ను శ్రమ పెడుతున్నా. ప్లీజ్" అభ్యర్థనగా అన్నాడు.

"అలాగే ప్రయత్నం చేస్తా"

"ప్రయత్నం కాదు. చెయ్యాలి. నీ నెంబర్ ఇస్తా. రేపు ఫోన్ చెయ్యమంటాను"

"రైట్".

తిరుపతిలో ఉన్నవారికి ఇవన్నీ తప్పవు అనుకుంటూ స్నానానికి కదిలాడు రామారావు.

***

ఉదయం ఏడుగంటలు.

"ఆకలేస్తే అన్నం పెడతా... అలిసొస్తే"

"హలో" ఫోన్ అందుకున్నాడు రామారావు.

"నమస్తే రామారావుగారేనా?"

"ఆఁ మాట్లాడుతున్నాను".

"నా పేరు సుందరండీ. లక్ష్మీపతి మీ నెంబరిచ్చాడు".

"అవునండీ చెప్పాడు. ఇప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు".

"రైల్వేస్టేషన్‌లో"

"అలాగా"

"సరే. మీరు నేరుగా కొండకు వెళ్ళి... ..." అంటూ అక్కడ ఎవర్ని కలుసుకోవాలో చెప్పాడు రామారావు.

"థాంక్సండీ. మీకు శ్రమ ఇచ్చాను".

"ఫర్వాలేదు".

***

"హలో" ఫోన్ అందుకుని పలికాడు రామారావు.

"నేనండీ సుందర్‌ను".

"నమస్తే. చెప్పండి".


"ఎప్పుడు?"

"24వ తారీఖు"

"ఇరవై నాలుగా? ... ..."

"ఆ రోజు నేను ఊర్లో ఉండను సుందర్‌గారూ..." ఎందుకీ ఇబ్బంది అనుకుంటూ చెప్పాడు రామారావు.

"మీరు లేకపోయినా ఫర్వాలేదు. ఏర్పాట్లు చేస్తే చాలు".



"నేను లేకుండా వీలు కాదు".

"అయ్యో! అలాగా! పోనీ ఏ డేట్‌లో ఉంటారో చెప్పండి? వాళ్ళను ఆ డేట్‌కే రమ్మంటాను" తాపీగా అడిగాడు.

"ఫస్ట్‌కు పైన రమ్మనండి" ఇక తప్పదు అన్నట్లు చెప్పాడు రామారావు.

***

"ఆకలేస్తే... ..."

"ఆఁ చెప్పండి సుందర్‌గారూ!" మళ్ళీ దర్శనాలకి అనుకుంటూ విసుగ్గా అడిగాడు రామారావు సుందర్‌ని పరిచయం చేసిన లక్ష్మీపతిని తిట్టుకుంటూ.

"బాగున్నారు కదూ"

"ఆఁ"

ఏం లేదండీ! ఈ నెల పదిన మా అమ్మాయి పెళ్ళి హైదరాబాదులో. మీరు కుటుంబంతో సహా రావాలి.

"ఇక్కడ ఏర్పాట్లు నేను చూస్తాను".

"పదో తారీకా, ప్రయత్నిస్తానండీ".

"అలా అంటే ఎలా రామారావుగారూ. తప్పక రావాలి. మీ అడ్రస్ చెప్పండి. పత్రిక పంపుతాను".

అడ్రస్సు చెప్పాడు రామారావు.

"రావడానికి ప్రయత్నించండి" మళ్ళీ చెప్పాడు సుందర్.

"అలాగే"

ఫోన్లో మాట్లాడుకోవడమేగాని మనిషితో పరిచయం లేదు. అయినా పెళ్లికి రమ్మన్నాడు. అంత దూరం వెళ్లాలంటే సెలవులు, పనులు, ఖర్చులు అన్నీ లెక్క వేసుకోవాలి. అయినా సెల్‌ఫోన్లు వచ్చిన తర్వాత మనుషులు కలుసుకోవటం తక్కువ, మాట్లాడుకోవటం ఎక్కువ అయింది.

గాలి ద్వారా బంధాలు ఏర్పడుతున్నాయి. పరస్పర ముఖ పరిచయాలు లేకపోయినా సంబంధాలు వుంటున్నాయి. కాలంతో పని లేకుండా కొనసాగుతున్నాయి. గాలి బంధాలు అనాలో, సెల్లు బంధాలు అనాలో అర్థం కావడం లేదు. శరీరంలో ఒక భాగంగా మారిపోతోంది సెల్లు. ఉదయం అలారంగా, విషయాలు గుర్తు చేసే రిమైండర్‌గా, ఫోన్ పుస్తకంగా, రేడియోగా, కెమెరాగా, ఇలా...విశ్వరూపం దాల్చి మనిషిని, మనసును ఆక్రమించేస్తోంది సెల్లు అని నిట్టూరుస్తూ కదిలాడు రామారావు.

***

"ఏమిటే ఇంత ఆలస్యమైంది. మేమెంత కంగారుపడుతున్నాం" ఇంట్లోకి అడుగు పెడుతున్న కూతుర్ని కోపంగా చూస్తూ అడిగింది మాధవి.

"కంగారెందుకు? ఈ వేళ కాలేజ్‌లో ఫంక్షనుంది. ఆలస్యంగా వస్తానని నాన్న సెల్‌కు మెసేజ్ ఇచ్చాను కదా" తండ్రిని చూస్తూ చెప్పింది సౌమ్య.

"ఔనా!"అడిగింది మాధవి రామారావుని.

"నేను మెసేజ్‌లు చూడలేదమ్మా" చెప్పాడు రామారావు.




తండ్రి సెల్ అందుకుని మెసేజ్ ఓపెన్ చేసి చూపించింది సౌమ్య.

"అమ్మాయి విషయం సరే, మీకెందుకాలస్యం అయింది" అడిగింది మాధవి భర్తను.

"అదీ నేను వస్తుండగా ఓ యాక్సిడెంటు. ఆ విషయం రిపోర్టు చేసి వచ్చేసరికి ఆ సమయం అయింది".

"యాక్సిడెంటా! ఎవరికి నాన్నా".

"తెలీదమ్మా ఎవరో ఇంజనీరింగ్ కుర్రాడట. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ బైక్ డ్రైవ్ చేస్తూ బస్సుకు గుద్దేశాడు.

"అయ్యయ్యో ఏమైంది నాన్నా".

"కాలు చెయ్యి విరిగాయనుకుంటా. తీరా ఆసుపత్రికి వెళ్ళేసరికి అక్కడ పిచ్చోడు తగిలాడు".

"సీక్వెన్స్ బావుంది... ... పిచ్చాడేం చేశాడు".

"ఏమీ చేయలేదమ్మా. తనలో తనే మాట్లాడుకుంటున్నాడు. బాగా చదువుకున్న కుర్రాడులా వున్నాడు. నాకు మొదట ఏమీ అర్థంకాలా. తీరా చూద్దును కదా అది ఫోన్ లేకుండా సెల్లో మాట్లాడమట. నవ్వుతూ

**ఫోన్లో మాట్లాడుకోవడమేగాని మనిషితో పరిచయం లేదు. అయినా పెళ్లికి రమ్మన్నాడు. అంత దూరం వెళ్లాలంటే సెలవులు, పనులు, ఖర్చులు అన్నీ లెక్క వేసుకోవాలి. అయినా సెల్‌ఫోన్లు వచ్చిన తర్వాత మనుషులు కలుసుకోవటం తక్కువ, మాట్లాడు కోవటం ఎక్కువ అయింది.**

చెప్పాడు రామారావు.

"దాన్ని బ్లూ టూత్ అంటారు నాన్నా".

"బ్లూ టూత్, ఎల్లో ఐసో కానీ మొత్తానికి బావుంది సెల్ భారతం. ఇద్దరూ భోజనానికి రండి" ఆజ్ఞ జారీ చేసింది మాధవి నవ్వుతూ.

***

"ఆకలేస్తే... అన్నం పెడతా" దీక్షగా వార్త రాసుకుంటూ ఉండగా మ్రోగింది సెల్.

అందుకుని చూశాడు. 'సుందర్' అన్న పేరు డిస్‌ప్లే అవుతోంది.

తీయాలా వద్దా అని ఆలోచించి చివరకు తీశాడు.

"నమస్కారం సుందర్‌గారు"

"నమస్తే అంకుల్! నేను సుందర్ కాను. వారి అబ్బాయిని".

"అలాగా! చెప్పమ్మా".

"అంకుల్... ..." అంటూ ఆగిపోయాడు అతను.

"ఏంటయ్యా చెప్పు".

"నాన్నగారు పోయారు... ..." గాద్గద్యంగా చెప్పాడు.

"అయ్యో! ఎప్పుడు?"

"రెండు రోజులైంది. 16వ తారీఖు శుభస్వీకరణ"

"అయాం వెరీ సారీ! బాధపడుతూ చెప్పాడు రామారావు. ఫోన్లో మాట్లాడ్డం తప్ప ఇన్ని నెలలుగా సుందర్‌ను చూడలేదు.

"వీలైతే 16వ తేదీ రండి... అంతేగాని" ఆగిపోయాడు అతను.

"అంతేగాని... " అర్థంగాక అడిగాడు రామారావు.

"ఏమీలేదు. సెల్‌లో సానుభూతి సందేశం, అదే కండోలెన్స్ మెసేజ్ మాత్రం పంపకండి" అన్నాడు కొన్ని క్షణాలు ఆగి.

లైన్ కట్ అయింది. షాక్ తగిలినట్లు నిశ్చేష్టుడయ్యాడు రామారావు.

పక్కనే ఉన్న దేవాలయం స్పీకర్‌లో అప్పుడే భగవద్గీత ప్రారంభమైంది.

అది రామారావుకు ఇలా వినిపించింది.

"సెల్లుతో గలుగు బాంధవ్యములెల్ల
సెల్లుతో నశియించి నెట్‌వర్క్ గలయు-
పాత వలువలు వీడి
కొత్త వలువలు కట్టుకొన్నట్టి రీతి
ఒక జేబు వదలి
మరొక జేబు ప్రవేశించు... సెల్లు-
తనువనిత్యమ్ము... ...నిత్యమ్ము సెల్లు
యొకటె"